22-12-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## “ మధురమైన పిల్లలారా - మీకిప్పుడు తండ్రి ద్వారా దివ్యదృష్టి లభించింది. ఆ దివ్యదృష్టి ద్వారానే మీరు ఆత్మ, పరమాత్మలను చూడగలరు ”

**ప్రశ్న:-** డ్రామాలోని ఏ రహస్యాన్ని అర్థము చేసుకున్నవారు ఏ సలహాను ఎవ్వరికీ ఇవ్వరు?

**జవాబు :-** డ్రామాలో జరిగిపోయినదంతా మళ్ళీ ఖచ్ఛితంగా రిపీట్(పునరావృత్తము) అవుతుందని ఎవరు అర్థము చేసుకుంటారో, వారు ఎప్పుడూ ఎవ్వరికీ భక్తిని వదిలి పెట్టమని సలహా ఇవ్వరు. ఎప్పుడైతే వారి బుద్ధిలో జ్ఞానము బాగా కూర్చుంటుందో, అప్పుడు మనమంతా ఆత్మలమని, మనము అనంతమైన తండ్రి ద్వారా వారసత్వము తీసుకోవాలని అర్థం చేసుకుంటారు. బేహద్ తండ్రి పరిచయము లభించినప్పుడు, హద్దులోని విషయాలన్నీ స్వతహాగానే సమాప్తమైపోతాయి.

**ఓంశాంతి.** ఆత్మలైన మీరు మీ స్వధర్మములో కూర్చొని ఉన్నారా? ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలను అడుగుతున్నారు - ఎందుకంటే పిల్లలు అనంతమైన తండ్రి ఒక్కరేనని తెలుసుకున్నారు, వారిని రూహ్ అని అంటారు, సుప్రీమ్ అని అంటారు. కేవలం వారిని మాత్రమే సుప్రీమ్ అని అంటారు. సుప్రీమ్ ఆత్మ లేక పరమ్ ఆత్మ అని అంటారు. పరమాత్మ తప్పనిసరిగా ఉన్నారు, పరమాత్మ లేనే లేరని అనరు. పరమ ఆత్మ అనగా పరమాత్మ. ఇది కూడా వివరించబడింది, తికమకపడరాదు ఎందుకంటే 5 వేల సంవత్సరాల క్రితము కూడా ఈ జ్ఞానము మీరు విన్నారు. వినేది ఆత్మనే. ఆత్మ చాలా చిన్నది, సూక్ష్మమైనది. ఎంత చిన్నదంటే దానిని ఈ కనులతో చూడలేము. ఆత్మను ఈ కనులతో చూచిన మనుష్యులు ఎవ్వరూ ఉండరు. చూడవచ్చు కానీ కేవలం దివ్యదృష్టితోనే చూడాలి. అది కూడా డ్రామా ప్లాను అనుసారము జరుగుతుంది. అచ్ఛా, ఎవరికైనా ఆత్మ సాక్షాత్కారము అయ్యిందనుకోండి, అది కూడా ఇతర వస్తువులను చూసినట్లు ఈ కనుల ద్వారానే జరుగుతుంది. భక్తిమార్గములో కూడా ఏదైనా సాక్షాత్కారము జరిగినా అది కూడా ఈ కనుల ద్వారానే జరుగుతుంది. దివ్యదృష్టి లభించినప్పుడు చైతన్యములో చూస్తారు. ఆత్మకు జ్ఞాన చక్షువు లభిస్తుంది. దాని ద్వారా చూస్తారు కాని ధ్యానములో చూస్తారు. భక్తిమార్గములో చాలా భక్తి చేసినప్పుడు సాక్షాత్కారము జరుగుతుంది. మీరాబాయికి సాక్షాత్కారమైనప్పుడు ఆమె నృత్యము చేసేది, నిజానికి అక్కడ వైకుంఠము లేనే లేదు. ఇది 5-6 వందల సంవత్సరాల క్రితము జరిగి ఉంటుంది, అప్పుడు వైకుంఠము లేనే లేదు, జరిగిపోయిన దానిని దివ్యదృష్టితో చూడటం జరుగుతుంది. భక్తి అధికంగా చేస్తూ చేస్తూ పూర్తిగా భక్తిమయమైనప్పుడు సాక్షాత్కారమౌతుంది. కాని దాని వలన ముక్తి లభించదు, ముక్తి-జీవన్ముక్తుల మార్గము భక్తిమార్గానికి పూర్తిగా భిన్నమైనది. భారతదేశములో అనేక మందిరాలున్నాయి. మందిరంలో శివలింగాన్ని పెద్దది లేక చిన్నది ఉంచుతారు. ఆత్మ ఎలా ఉంటుందో, పరమపిత పరమాత్మ కూడా అలాగే ఉంటారని పిల్లలైన మీకిప్పుడు తెలుసు. ఇరువురి సైజు ఒక్కటిగానే ఉంటుంది. తండ్రి ఎలా ఉంటారో పిల్లలు కూడా అలాగే ఉంటారు. ఆత్మలందరూ సోదరులే(భాయి-భాయి). ఆత్మలు పాత్రను అభినయించేందుకు శరీరాలలో ప్రవేశిస్తాయని అర్థము చేసుకోవాలి. ఇవి భక్తిమార్గములోని కట్టుకథలు కావు. జ్ఞానమార్గములోని విషయాలు కేవలం ఒక్క తండ్రి మాత్రమే అర్థము చేయిస్తారు. తెలియజేసేవారు

అనంతమైన తండ్రి నిరాకారుడని మొట్టమొదట అర్థము చేయించాలి. వారిని గురించి పూర్తిగా ఎవ్వరికీ తెలియదు. వారు సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది రైటు(సరి) కాదు. తండ్రిని చాలా ప్రేమగా పిలుస్తారు. బాబా మీరు వచ్చినప్పుడు మేము మీ పై పూర్తిగా సమర్పణవుతామని అంటారు. నాకు మీరు తప్ప మరెవ్వరూ లేరు అని అంటారు. కావున వారిని తప్పనిసరిగా స్మృతి చేయాల్సి వస్తుంది. వారు కూడా స్వయంగా పిల్లలారా! అని పిలుస్తారు. వారు ఆత్మలతోనే మాట్లాడ్తారు. దీనిని ఆత్మిక జ్ఞానమని అంటారు. ఆత్మ-పరమాత్మలు చాలా కాలము వేరుగా ఉన్నారు(ఆత్మా- పరమాత్మా అలగ్ రహే బహుకాల్.....) అని మహిమ కూడా చేస్తారు. ఎంతకాలము ఉంటారో లెక్క కూడా తెలుపబడింది. చాలాకాలము నుండి ఆత్మలైన మీరు వేరుగా ఉంటారు. మీరే మళ్లీ ఈ సమయంలో తండ్రి వద్దకు రాజయోగము నేర్చుకునేందుకు వచ్చారు. ఈ టీచరు మీకు సేవకుడు. టీచరు ఎల్లప్పుడూ వినయ విధేయతలు గల సేవకునిగా(Obedient Servant) ఉంటాడు. తండ్రి కూడా నేను పిల్లలందరికీ సేవకుడనని అంటారు. ఓ పతితపావనా! మీరు వచ్చి మమ్ములను పావనంగా చేయండి అని మీరు ఎంతో అధికారముతో పిలుస్తారు. అందరూ భక్తులే. ఓ భగవంతుడా! మీరు వచ్చి భక్తులైన మమ్ములను మళ్లీ పావనంగా చేయండని పిలుస్తారు. స్వర్గమును పావన ప్రపంచమని, నరకమును పతిత ప్రపంచమని అంటారు. ఇవన్నీ అర్థము చేసుకునే విషయాలు. ఇది కళాశాల లేక గాడ్‌ఫాదర్లీ విశ్వవిద్యాలయము(God-Fatherly World University). దీని లక్ష్యము - మనుష్యులను దేవతలుగా తయారు చేయడం. మేము ఇలా తయారవ్వాలని పిల్లలు నిశ్చయించుకుంటారు. నిశ్చయం లేనివారు పాఠశాలలో అసలు కూర్చుంటారా? లక్ష్యమైతే బుద్ధిలో ఉంది. బ్యారిస్టరుగా లేక డాక్టరుగా అవుతామని అనుకున్నప్పుడే కదా చదువుతారు. నిశ్చయం లేకుంటే ఇక్కడకు రానే రారు. మేము మనుష్యుల నుండి దేవతలుగా, నరుని నుండి నారాయణునిగా అవుతామని మీకు నిశ్చయముంది. ఇది సత్య-సత్యమైన నరుని నుండి నారాయణునిగా తయారయ్యే కథ. వాస్తవానికి ఇది చదువు. కాని దీనిని కథ అని ఎందుకంటారు? ఎందుకంటే 5 వేల సంవత్సరాల క్రితము కూడా దీనిని మీరు విన్నారు. జరిగిపోయింది, జరిగిపోయిన దానిని కథ అని అంటారు. ఇది నరుని నుండి నారాయణునిగా తయారయ్యే శిక్షణ. నూతన ప్రపంచములో దేవతలుంటారని, పాత ప్రపంచములో మనుష్యులుంటారని పిల్లలు హృదయంలో అర్థము చేసుకున్నారు. దేవతలలో ఉన్న గుణాలు మనుష్యులలో లేవు, అందుకే వారిని దేవతలని అంటారు. మనుష్యులు దేవతలకు నమస్కరిస్తారు. మీరు(దేవతలను) సర్వ గుణసంపన్నులు.... అని అంటూ స్వయాన్ని పాపులమని, నీచులమని చెప్పుకుంటారు. ఇలా అనేది మనుష్యులే. దేవతలు మనుష్యులతో ఇలా అనరు. దేవతలు సత్యయుగంలో ఉంటారు, కలియుగంలో ఉండరు. అయితే ఈ రోజులలో అందరిని శ్రీ శ్రీ అని అనేస్తారు. శ్రీ అనగా శ్రేష్ఠులు. సర్వ శ్రేష్ఠంగా తయారు చేయగలవారు ఒక్క భగవంతుడు మాత్రమే. శ్రేష్ఠమైన దేవతలు సత్యయుగంలో ఉండేవారు. ఈ సమయంలో మనుష్యులెవ్వరూ శ్రేష్ఠంగా లేరు. పిల్లలైన మీరిప్పుడు బేహద్ సన్యాసము చేస్తారు. ఈ పాత ప్రపంచము సమాప్తమైపోతుందని మీకు తెలుసు. అందువలన వీటన్నిటిపై మీకు వైరాగ్యము కలిగింది. వారిది హఠయోగ సన్యాసము. ఇల్లు-వాకిలి వదిలి వెళ్లి మరలా వచ్చి పెద్ద - పెద్ద భవనాలలో కూర్చున్నారు. లేకుంటే కుటీరానికి ఖర్చు ఏమీ ఉండదు. ఏకాంతము కావాలంటే కుటీరంలో కూర్చోవాలి, భవనాలలో కాదు. బాబాకు కుటీరము తయారు చేయబడింది. కుటీరములో అన్ని సుఖాలున్నాయి.

ఇప్పుడు పిల్లలైన మీరు పురుషార్థము చేసి మనుష్యుల నుండి దేవతలుగా తయారవ్వాలి. డ్రామాలో ఏమేం జరిగిపోయిందో అదంతా మళ్లీ ఖచ్చితంగా పునరావృతమవుతుందని మీకు తెలుసు. అందువలన భక్తి వదిలేయమని ఎవ్వరికీ సలహా ఇవ్వరాదు. ఎప్పుడైతే జ్ఞానము బుద్ధిలో కూర్చుంటుందో అప్పుడు మనమంతా ఆత్మలమని అర్థము చేసుకుంటారు. అనంతమైన తండ్రి నుండి వారసత్వము తీసుకోవాలని కూడా తెలుసుకుంటారు. బేహద్ తండ్రి పరిచయము లభించినప్పుడు హద్దు విషయాలన్నీ సమాప్తమైపోతాయి. తండ్రి అంటున్నారు - గృహస్థ వ్యవహారములో ఉంటూ కేవలం బుద్ధియోగాన్ని తండ్రితో జోడించాలి. శరీర నిర్వహణార్థము కర్మలు కూడా చేయాలి. భక్తిమార్గములో కూడా కొంతమంది చాలా నౌధా భక్తి చేస్తారు. ప్రతి రోజూ వెళ్ళి నియమానుసారము దర్శనము చేసుకుంటారు. అది దేహధారుల వద్దకు వెళ్లడం. అవన్నీ దేహ సంబంధమైన యాత్రలు. భక్తిమార్గములో ఎన్నో ఎదురుదెబ్బలు తినవలసి ఉంటుంది. ఇక్కడ అటువంటివేమీ లేవు. ఎవరైనా వచ్చినప్పుడు అర్థం చేయించేందుకు కూర్చోబెడ్తారు. స్మృతి చేసేందుకు ఒక్క జాగాలోనే కూర్చునే అవసరము లేదు. భక్తిమార్గములో కృష్ణుని భక్తులు నడుస్తూ - తిరుగుతూ కృష్ణుని స్మృతి చేయలేరని కాదు. అందుకే చదువుకున్నవారు కృష్ణుని చిత్రము ఇంట్లో ఉంది కదా మరి మందిరానికి ఎందుకెళ్తారని అంటారు, కృష్ణుని చిత్రాన్ని ఎక్కడైనా పూజించమని అంటారు. చిత్రము లేకుంటే స్మృతి చేస్తూ ఉండు అని అంటారు. ఒక్కసారి చూసిన వస్తువు గుర్తుంటుంది. మీకు కూడా ఇదే చెప్తున్నారు - శివబాబాను మీరు ఇంట్లో కూర్చొని స్మృతి చేయలేరా? ఇది నూతన విషయము. శివబాబాను గురించి ఎవ్వరికీ తెలియదు. నామ-రూప-దేశ-కాలాదులు ఎవ్వరికీ తెలియదు. అందుకే సర్వవ్యాపి అని అంటారు. ఆత్మను పరమాత్మ అని అనరాదు. ఆత్మకు తండ్రి స్మృతి వస్తుంది. కాని తండ్రి ఎవరో తెలియనందున 7 రోజులు అర్థము చేయించాలి. అంతే కాకుండా ఇతర ఆసక్తికరమైన అంశాలను కూడా విస్తారంగా అర్థం చేయించాల్సి వస్తుంది. తండ్రి జ్ఞానసాగరులు కదా. చాలాకాలము నుండి వింటున్నారు, ఎందుకంటే ఇది జ్ఞానము కదా. మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యే జ్ఞానము లభిస్తూ ఉందని అర్థము చేసుకున్నారు. తండ్రి అంటున్నారు - మీకు కొత్త-కొత్త నిగూఢమైన విషయాలు వినిపిస్తాను. మురళి లభించకపోతే మీరు ఎంతగా తపిస్తారు. తండ్రి అంటున్నారు - మీరు తండ్రిని స్మృతి చేయండి. మురళి చదువుతారు కాని మళ్లీ మర్చిపోతారు. మొట్టమొదట ఇది గుర్తుంచుకోవాలి. " నేను ఆత్మను చాలా చిన్న బిందువును." ఆత్మను కూడా తెలుసుకోవాలి. వీరి ఆత్మ మరొకరిలో ప్రవేశించిందని కూడా అంటారు. ఆత్మలైన మనమే జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇప్పుడు పతితంగా, అపవిత్రమైపోయాము. మొదట మీరు పవిత్ర గృహస్థ ధర్మానికి చెందినవారు. లక్ష్మీనారాయణులు ఇరువురు పవిత్రంగా ఉండేవారు. ఆ తర్వాత ఇరువురూ అపవిత్రంగా అయ్యారు. మళ్లీ ఇరువురూ పవిత్రంగా అవుతారు. మరి వారు అపవిత్రుల నుండి పవిత్రులుగా అయ్యారా? లేక పవిత్ర జన్మ తీసుకున్నారా? మీరెంత పవిత్రంగా ఉండేవారో, వామమార్గములోకి వెళ్లడం వలన అపవిత్రంగా ఎలా అయ్యారో తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు. పూజారులను అపవిత్రులని, పూజ్యులను పవిత్రులని అంటారు. మొత్తం ప్రపంచమంతటి చరిత్ర-భూగోళాలు ఇప్పుడు మీ బుద్ధిలో ఉన్నాయి. ఎవరెవరు రాజ్యపాలన చేసేవారో వారికి రాజ్యమెలా లభించిందో మీకు తెలుసు. ఇతరులెవ్వరికీ ఈ విషయాలు తెలియవు. మీ వద్ద కూడా ఇంతకు ముందు ఈ రచన-రచయితల ఆదిమధ్యాంతాల జ్ఞానము లేదు

అనగా నాస్తికులుగా ఉండేవారు. ఇంతకు ముందు తెలియదు. నాస్తికులుగా అవ్వడం వలన ఎంతో దు:ఖితులుగా అయిపోయారు. ఇప్పుడు మీరు ఇలాంటి దేవతలుగా అయ్యేందుకు ఇక్కడకు వచ్చారు. అక్కడ ఎంతో సుఖంగా ఉంటారు. దైవీగుణాలను కూడా ఇక్కడే ధారణ చేయాలి. ప్రజాపిత బ్రహ్మా సంతానము పరస్పరము సోదరీ-సోదరులవుతారు కదా! కనుక వికారిదృష్టి ఉండరాదు. దీనికై శ్రమించాలి. కళ్ళు చాలా నేరము చేస్తాయి. అన్ని అంగాల కంటే కళ్ళు అత్యంత వికారాన్ని కలుగజేస్తాయి. అర్ధకల్పము వికారీగా(క్రిమినల్‌గా), అర్ధకల్పము పవిత్రంగా ఉంటాయి. సత్యయుగములో క్రిమినల్(వికారీ)గా ఉండవు. కనులు క్రిమినల్‌గా ఉంటే అసురులని అంటారు. తండ్రి స్వయంగా చెప్తున్నారు - నేను పతిత ప్రపంచములో వస్తాను. ఎవరైతే పతితులయ్యారో వారు పావనంగా అవ్వాలి. వీరు ఇతనిని భగవంతుడని చెప్పుకుంటున్నారని మనుష్యులంటారు. వృక్షములో తమోప్రధాన ప్రపంచము యొక్క చిట్టచివరిలో నిల్చొని ఉన్నాడు. అతడే మళ్ళీ క్రింద తపస్సు చేస్తూ ఉన్నాడు. సత్యయుగంలో లక్ష్మీనారాయణుల వంశము కొనసాగుతుంది. ఈ లక్ష్మీనారాయణులతోనే శకము లెక్కించబడ్తుంది. అందుకే తండ్రి అంటున్నారు - లక్ష్మీనారాయణుల రాజ్యాన్ని చూపినప్పుడు దీని తర్వాత 1250 సంవత్సరాల తర్వాత త్రేతా యుగము వస్తుందని వ్రాయండి. శాస్త్రాలలో లక్షల సంవత్సరాలని వ్రాసేశారు. రాత్రికి పగలుకు ఉన్నంత తేడా ఉంది కదా. అర్ధకల్పము బ్రహ్మా రాత్రి, అర్ధకల్పము బ్రహ్మా పగలు ఈ విషయాలు తండ్రియే వివరిస్తారు. మళ్ళీ చెప్తున్నారు - మధురమైన పిల్లలూ, స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయండి, వారిని స్మృతి చేస్తూ చేస్తూ మీరు పావనమైపోతారు. ఆ తర్వాత అంతమతి సో గతి అయిపోతుంది. ఇక్కడే వచ్చి కూర్చోమని తండ్రి చెప్పరు. సేవాధారి పిల్లలను అలా కూర్చోబెట్టరు. సేవాకేంద్రాలు, మ్యూజియంలు మొదలైనవి తెరుస్తూనే ఉంటారు. చాలామందికి ఆహ్వానపత్రాలు పంచుతారు. మీరు వచ్చి దైవీ జన్మసిద్ధ అధికారమైన విశ్వ చక్రవర్తి పదవిని తీసుకోమని ఆహ్వానిస్తారు. మీరు తండ్రి పిల్లలైనందున, తండ్రి స్వర్గ రచయిత అయినందున మీకు కూడా స్వర్గ వారసత్వముండాలి. తండ్రి అంటున్నారు - నేను ఒక్కసారి మాత్రమే స్వర్గ స్థాపన చేసేందుకు వస్తాను, ఉన్న ప్రపంచము ఒక్కటే. దాని చక్రము తిరుగుతూ ఉంటుంది. మానవులకైతే అనేక మతాలు, అనేక విషయాలున్నాయి. ఎన్నో మత-మతాంతరాలున్నాయి. దీనిని అద్వైత మతమని అంటారు. వృక్షము చాలా పెద్దది. అనేక కొమ్మలు, రెమ్మలు వెలువడ్డాయి. అనేక ధర్మాలు వ్యాపిస్తున్నాయి. మొదట ఒకే రాజ్యము, ఒకే ధర్మముండేది. మొత్తం విశ్వమంతటిలో వీరి(లక్ష్మీనారాయణుల) రాజ్యముండేది. ఇది కూడా మీకు ఇప్పుడే తెలిసింది. మనమే విశ్వమంతటికీ యజమానులుగా ఉండేవారము. 84 జన్మలు తీసుకున్న తర్వాత మళ్ళీ నిరుపేదలుగా అయ్యాము. ఇప్పుడు మీరు మృత్యువు పై విజయము పొందుతారు, అక్కడ ఎప్పుడూ అకాలమృత్యువు జరగదు. ఇక్కడ కూర్చొని ఉండే అకాల మృత్యువు పాలవుతున్నారు. నలువైపులా మృత్యువు తాండవిస్తూ ఉంది. అక్కడ అలా జరగదు, సంపూర్ణ ఆయువు ఉంటుంది. భారతదేశములో పవిత్రత, శాంతి, సుఖములుండేవి. సరాసరి150 సంవత్సరాల ఆయువు ఉండేది. ఇప్పుడు ఎంత ఉంది?

ఈశ్వరుడు మీకు యోగము నేర్పించారు అందువలన మిమ్ములను యోగేశ్వరులని అంటారు. అక్కడ అలా అనరు. ఇప్పుడు మీరు యోగేశ్వరులు. మీకు ఈశ్వరుడు రాజయోగము నేర్పిస్తున్నారు. ఆ తర్వాత మళ్ళీ రాజ-రాజేశ్వరులుగా అవుతారు. ఇప్పుడు మీరు జ్ఞానేశ్వరులు తర్వాత రాజేశ్వరులు

అనగా రాజాధి రాజులుగా అవుతారు. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. కనులను పవిత్రంగా తయారు చేసుకునేందుకు శ్రమ చేయాలి. మనము ప్రజాపిత బ్రహ్మా పిల్లలము సోదరీ - సోదరులము, వికారీ దృష్టి ఉండరాదని బుద్ధిలో సదా ఉండాలి.
2. శరీర నిర్వహణ కొరకు కర్మలు చేస్తూ బుద్ధి యోగాన్ని ఒక్క తండ్రితో జోడించాలి. హద్దు విషయాలన్నీ వదిలి బేహద్ తండ్రిని స్మృతి చేయాలి. బేహద్ సన్యాసులుగా అవ్వాలి.

## వరదానము :- " సదా అతీంద్రియ సుఖమనే ఊయలలో ఊగే సంగమయుగ సర్వ అలౌకిక ప్రాప్తులతో సంపన్న భవ "

ఏ పిల్లలైతే అలౌకిక ప్రాప్తులతో సదా సంపన్నంగా ఉంటారో, వారు అతీంద్రియ సుఖమనే ఊయలలో ఊగుతూ ఉంటారు. ఉదాహరణానికి ఎవరైతే చాలా ప్రియమైన పిల్లలుగా ఉంటారో వారిని ఊయలలో ఊపుతారు. అలా సర్వ ప్రాప్తి సంపన్న బ్రాహ్మణుల ఊయల అతీంద్రియ సుఖమనే ఊయల. ఈ ఊయలలో సదా ఊగుతూ ఉండండి. ఎప్పుడూ దేహాభిమానములోకి రాకండి. ఎవరైతే ఊయల నుండి దిగి భూమిపై కాలు పెట్టారో వారు మలినమౌతారు. అత్యంత ఉన్నతమైన తండ్రి యొక్క స్వచ్ఛమైన పిల్లలు సదా అతీంద్రియ సుఖమనే ఊయలలో ఊగుతారు, మట్టిలో కాలు పెట్టరు.

## స్లోగన్ :- " " నేను త్యాగిని " అనే అభిమానాన్ని త్యాగం చేయడమే సత్యమైన త్యాగము. "